

బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి

బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన నిర్వహిస్తున్న ఐక్యతా విజయపథం పాదయాత్ర గురువారం కొండపి చేరుకుంది. - 8లో..



ఎస్‌జీఎఫ్ అండర్-19 షెడ్యూల్ విడుదల

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 క్రీడల షెడ్యూల్‌ను ఆర్‌ఐవో సైమన్‌విక్టర్, ఇంటర్ విద్య జిల్లా అధికారి శ్రీనివాసరావు విడుదల చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 36/28

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మార్పులు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మార్పులు చేర్పులు చేసినట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మార్పులు, కొత్త పోలింగ్ కేంద్రాలపై కసరత్తు పూర్తయిందని తెలిపారు. 8 నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో పోలింగ్ కేంద్రాలను సరిచేశామన్నారు. 1400 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలను రెండు పోలింగ్ కేంద్రాలుగా చేసినట్లు చెప్పారు. లొకేషన్ మార్పు, ఒకే భవనంలో గదుల మార్పులను కూడా పూర్తి చేశామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ట్రైనీ కలెక్టర్ సూర్యమాన్ పాటిల్, డీఆర్వో శ్రీలత, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు విశ్వేశ్వరరావు, అజయ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ నారదముని, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషా బేగ్, రాజశేఖర్, సత్యం, రసూల్ తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈ నెల 23వ తేదీ ఒంగోలు చేరుకుని నగరంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు రాంనగర్‌లోని తన కార్యాలయంలో ఎంపీ అందుబాటులో ఉంటారు. 11 గంటలకు రాంనగర్ రెండో లైనులో గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో గణేశ భక్తబృందం నిర్వహించే పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి తన కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. సాయంత్రం 7.30 గంటలకు గాంధీరోడ్డులో గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తాతా ప్రసాద్, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు నిర్వహించే పూజా కార్యక్రమానికి హాజరవుతారు. రాత్రి 8.30 గంటలకు రంగుతోటలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణ మండపం వద్ద గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కుప్పం ప్రసాద్ భక్త బృందం నిర్వహించే పూజా కార్యక్రమంలో ఎంపీ మాగుంట పాల్గొంటారు.

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షునిగా స్వామిరెడ్డి



ఒంగోలు: వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షునిగా కోమట్ల స్వామిరెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. ఒంగోలు నగరానికి చెందిన స్వామిరెడ్డి 2009 నుంచి అడ్వకేట్ దాసరి రవీంద్రనాథ్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేశారు. 2016 నుంచి ఒంగోలులోనే అడ్వకేట్‌గా సొంతంగా ప్రాక్టీస్ చేస్తున్నారు.

నేడు దర్శిలో 'జగనన్నకు చెబుదాం'

దర్శి: స్థానిక శ్రీ శ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపంలో శుక్రవారం దర్శి మండల ప్రజల కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీటీ రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కలెక్టర్, అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహిస్తోంది. అందులో భాగంగా శుక్రవారం దర్శిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, ఆర్డీఓ తోట అజయ్‌కుమార్, ఇతర శాఖల జిల్లా అధికారులు హాజరుకానున్నారు. ప్రజలు వారి సమస్యలపై అర్జీలు అందజేస్తే వెంటనే పరిష్కరిస్తామని డీటీ తెలిపారు.

29న విద్యార్థులకు పోటీలు

ఒంగోలు: శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆచార్య దేవోభవ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలలకు శ్రీసత్యసాయి సేవా సమితి వలంటీర్లు వచ్చి వ్యాసరచన పోటీలకు అవసరమైన మెటీరియల్ సరఫరా చేస్తారన్నారు. పోటీల నిర్వహణ నిమిత్తం వారిని పాఠశాలల్లోకి అనుమతించాలన్నారు. ఈ ఫలితాలను నెలరోజుల్లో సంబంధిత పాఠశాలలకు తెలియజేస్తారని చెప్పారు.

పరిమితే హద్దు..!



నాగులుప్పలపాడు వద్ద పచ్చాకును కర్రకు కడుతున్న కూలీ (ఫైల్)



పొగాకు రైతులు అత్యాశకు పోవద్దు. అధిక లాభాలు వచ్చాయి కదా అని మితిమీరి సాగుచేయొద్దు. చైనా, బ్రెజిల్ తదితర దేశాల్లో ఎక్కువ విస్తీర్ణంలో పొగాకు సాగు చేశారు. రానున్న రోజుల్లో ఈ ఏడాది వచ్చిన ధరలు రాకపోవచ్చు. బ్యారన్లను ఎక్కువ కౌలుకు తీసుకుంటే లాభాల మాట అటుంచితే కనీసం పెట్టుబడి కూడా రాదు. అలాగే ఎక్కువ విస్తీర్ణంలో సాగు వద్దు. తస్మాత్ జాగ్రత్త.! అని హెచ్చరిస్తున్నారు పొగాకు బోర్డు అధికారులు, పొగాకు మార్కెట్ నిపుణులు.

- అనుమతికి మించి పొగాకు సాగు వద్దు
- 2023-24 సంవత్సరానికి టార్గెట్ 89.88 మిలియన్ కేజీలు
- 63 వేల హెక్టార్ల (1,60,000 ఎకరాల)లోనే పొగాకు సాగుకు అనుమతి
- కొత్త బ్యారన్లకు అనుమతి లేదు
- ఉన్న బ్యారన్లను వచ్చే నెల 26వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి
- ప్రత్యామ్నాయ పంటలే మేలు

చీమకుర్తి: కరోనా కారణంగా బ్రెజిల్, చైనా తదితర దేశాల్లో పొగాకు సాగు కనిష్ట స్థాయికి పడిపోయింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లో మన పొగాకుకు భారీ డిమాండ్ ఏర్పడింది. నాణ్యమైన పొగాకుతో పాటు పండుగుల్ల, సూరకు కూడా మంచి ధరలు వచ్చాయి. పొగాకు చరిత్రలోనే ఎప్పుడూ రాని ధర కేజీకి గరిష్టంగా రూ.285 వరకు పలికిందంటే.. ఈ ధరలు చారిత్రాత్మకంగా నిలిచాయని రైతులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ దఫా చైనా, బ్రెజిల్ వంటి దేశాల్లో పొగాకు సాగు మునుపటికంటే ఎక్కువ విస్తీర్ణంలో జరిగింది. మన దేశంలో పండించే పొగాకుకు ఈ ఏడాది పలికిన ధరలు వచ్చే పరిస్థితులు లేవని బోర్డు అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. కానీ, రైతులు అవేమీ పట్టించుకోకుండా ఒక్కో బ్యారన్ రైతుకు సరాసరిన రూ.4-5 లక్షల లాభాలు వచ్చాయనే ఆశతో ఎకరా పొలం కౌలు గతంలో రూ.10 వేల వరకు ఉండగా, ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టి కౌలుకు తీసుకుంటున్నారు. బ్యారన్ లీజు గతంలో రూ.50 వేల నుంచి రూ.60 వేల మధ్యే ఉండేది. ఇప్పుడు దాన్ని రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు పెంచేశారు. ప్రపంచ మార్కెట్‌లో పొగాకు సాగు ఉత్పత్తులను పరిగణనలోకి తీసుకుని రైతులు పొగాకు సాగుచేయాలని, ఈ ఏడాది వచ్చిన లాభాలు చూసి పరిమితికి మించి సాగు చేస్తే రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోతారని మార్కెట్ నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు.

89.8 మిలియన్ కేజీల కొనుగోలుకు అనుమతి...

ప్రకాశం రీజియన్ పరిధిలోని 11 వేలం ప్లాట్‌ఫాంలలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రైతుల నుంచి 89.88 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేసేందుకు పొగాకు బోర్డు అనుమతిచ్చింది. గతేడాది ఇది 87 మిలియన్ కేజీలు మాత్రమే ఉండగా, అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ ఏర్పడిన కారణంగా దానిని 123.11 మిలియన్ కేజీల వరకు కొనుగోలు చేశారు. ఈసారి భిన్నంగా ఉండవచ్చని తెలుస్తోంది.

63 వేల హెక్టార్లలో సాగుకు అనుమతి...

తేలిక రకం నేల (లైట్ సాయిల్)లో ఒక బ్యారన్‌కు 2.90 హెక్టార్లలో మాత్రమే సాగు చేయాల్సి ఉంటుంది. ఆ బ్యారన్ పరిధిలో 3,650 కేజీల పొగాకు కొనుగోలుకు మాత్రమే అనుమతి ఉంది. నల్లరేగడి నేల (బ్లాక్ సాయిల్)లో ఒక బ్యారన్‌కు 1.90 హెక్టార్లలో మాత్రమే పొగాకు సాగుకు అనుమతి ఉంది. దాని పరిధిలో 3,550 కేజీల పొగాకును మాత్రమే కొనుగోలు చేసేందుకు అనుమతి ఉంది. ఇలా జిల్లాలోని 63 వేల హెక్టార్లు (1.60 లక్షల ఎకరాలు)లో 89.88 మిలియన్ కేజీల పొగాకు పండించేందుకు మాత్రమే బోర్డు అనుమతిచ్చింది. రీజియన్ పరిధిలో 20,239 మంది రైతులు 24,379 బ్యారన్లలో పొగాకు సాగు చేసుకునేందుకు బోర్డు అనుమతిచ్చింది.

ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించాలి...

రైతులు వారికున్న మొత్తం పొలంలో పొగాకు సాగు చేసి నష్టాలు పాలయ్యేకంటే లాభాలు ఆర్జించేందుకు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించాలని పొగాకు బోర్డు అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలైన శనగ, మినుము, వరి, కంది, ఇతర పంటలపై రైతులు దృష్టి సారించాలంటూ అవగాహన కల్పించారు.

వచ్చే నెల 26 వరకు బ్యారన్ల రిజిస్ట్రేషన్లు...

పొగాకు సాగులో నూతన బ్యారన్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి లేదని బోర్డు అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఉన్న బ్యారన్ల లైసెన్స్‌లను ఒక రైతు నుంచి మరొక రైతు మార్చుకునే వెసులుబాటు ఉందే తప్ప కొత్తగా బ్యారన్ల లైసెన్స్‌లకు అనుమతి లేదు. ప్రస్తుతం ఉన్న బ్యారన్లను వచ్చే నెల 26వ తేదీలోపు రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు.

సిఫార్సు చేసిన వంగడాలను మాత్రమే సాగు చేయాలి...

పొగాకు దిగుబడి బాగా రావడానికి, తెగుళ్లను తట్టుకుని నిలబడే విధంగా బోర్డు సిఫార్సు చేసిన పొగాకు వంగడాలనే సాగు చేయాలని రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. సిరి, ఎఫ్‌సీఆర్-15 వంగడాలు మేలు రకానికి చెందినవని బోర్డు అధికారులు ప్రకటించారు.



పొగాకు బ్యారన్

అనుమతిచ్చిన మేరకే సాగు చేయాలి



పొగాకు బోర్డు అనుమతిచ్చిన మేరకే రానున్న ఏడాది పొగాకు సాగు చేయాలి. ఈ సంవత్సరం వచ్చిన లాభాలు వచ్చే ఏడాది ఉండకపోవచ్చు. ప్రకాశం జిల్లాలోని 11 వేలం కేంద్రాల పరిధిలో వచ్చే ఏడాదికి 89.98 మిలియన్ కేజీల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. బ్యారన్లను వచ్చే నెల 26వ తేదీలోపు రెన్యువల్ చేయించుకోవాలి.

– ఎం.లక్ష్మణరావు, ఆర్ఎం, ఒంగోలు, ప్రకాశం

గోవా మద్యం స్వాధీనం

- రూ.3 లక్షల విలువైన బాటిళ్లను సీజ్ చేసిన ఎస్ఈబీ
- ఆంధ్రా స్టిక్కర్లు అంటించి విక్రయిస్తున్న ఐదుగురు అరెస్టు
- మరో నలుగురిపై కూడా కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, కారు, స్టిక్కర్లు, నిందితులతో ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది

ఒంగోలు: గోవా నుంచి మద్యం బాటిళ్లు తీసుకొచ్చి వాటిపై ఆంధ్రా స్టిక్కర్లు అంటించి అక్రమంగా విక్రయిస్తున్న ఐదుగురిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు పట్టుకుని అరెస్టు చేశారు. వారితో పాటు మరో నలుగురిపై కూడా కేసు నమోదు చేశారు. వారి నుంచి మొత్తం రూ.3 లక్షల విలువైన గోవా మద్యం బాటిళ్లు సీజ్ చేశారు. స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో ఏఈఎస్ ఎం.సుధీర్‌బాబు గురువారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. నాగులుప్పలపాడు మండలం చిన్నంగారిపట్టపు పాలెం గ్రామానికి చెందిన మేకల బాబు పక్క రాష్ట్రాల నుంచి మద్యం బాటిళ్లు తీసుకొచ్చి స్థానికంగా అక్రమంగా విక్రయిస్తూ గతంలో ఒకసారి పట్టుబడ్డాడు. అప్పటి నుంచి అతనిపై ఒంగోలు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బొమ్మిశెట్టి లత, ఎస్సై ఎంవీ గోపాలకృష్ణ సాంకేతికంగా నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం బాబుకు చెందిన కారులో అతని భాగస్వామి అయిన సింగరాయకొండ మండలం ఊళ్లపాలేనికి చెందిన అరవ పవన్ కొత్తపట్నం మండలం మడనూరు పట్టపుపాలెంలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఈబీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కారులో వజ్జిరెడ్డిపాలేనికి చెందిన కటారి వెంకట్రావు, టెంకాయచెట్లపాలేనికి చెందిన వాయల వెంకటేశ్వర్లు, అలగాయపాలేనికి చెందిన వాయల తిరుపతి అక్రమ మద్యం కొనుగోలు చేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరు ముగ్గురూ వారి గ్రామాల్లో బెల్టుషాపులు కూడా నిర్వహిస్తూ అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు నిర్ధారించుకున్నారు. ఈ తనిఖీలలో ఇండికా కారులో ఉన్న 698 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. వాటిలో పలు బాటిళ్లపై అంటించిన స్టిక్కర్లు అనుమానాస్పదంగా ఉండటంతో పరిశీలించగా, గోవా నుంచి మద్యాన్ని తీసుకొచ్చి బాటిళ్లపై ఆంధ్రా స్టిక్కర్లు అంటించి విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ఆ స్టిక్కర్లను సింగరాయకొండలోని ఒక స్టిక్కరింగ్ షాపులో తయారు చేయిస్తున్నట్లు విచారణలో తేలింది. అటువంటి బాటిళ్లు 416 ఉండగా, మన రాష్ట్రంలోనే వేరే ప్రాంతంలోని షాపుల నుంచి తీసుకొచ్చి వేర్వేరు ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకెళ్తున్న బాటిళ్లు 282 ఉండగా, మొత్తం 698 బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు సీజ్ చేశారు. స్టిక్కర్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గోవాలో ఫ్రాన్సిస్ అనే వ్యక్తి వద్ద నుంచి పెద్ద మొత్తంలో మద్యం కొనుగోలు చేస్తుండగా, వాటిని తరలించేందుకు పొరుగు జిల్లాకు చెందిన ఒక వ్యక్తి కంటైనర్‌ను సమకూరుస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. మేకల బాబు, అరవ పవన్, కటారి వెంకట్రావు, వాయల వెంకటేశ్వర్లు, వాయల తిరుపతిని ఎస్ఈబీ అధికారులు అరెస్టు చేయగా, వీరితో పాటు గోవాకు చెందిన ఫ్రాన్సిస్, సింగరాయకొండలోని స్టిక్కర్ షాపు యజమాని, స్టిక్కర్లు తయారు చేసే వ్యక్తి, కంటైనర్ సమకూరుస్తున్న వ్యక్తితో కలిపి మరో నలుగురిని కూడా నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ఆ నలుగురి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు ఏఈఎస్ సుధీర్‌బాబు తెలిపారు.

చల్లగ చూడయ్యా.. గణపయ్యా



ఒంగోలులోని దేవుడుచెరువులో పూసల అలంకరణలో మట్టి గణపతి

వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. వాడవాడలా కొలువుదీరిన బొజ్జ గణపయ్యలకు భక్తులు పూజలు చేస్తూ దీవెనలు అందుకుంటున్నారు. విశేష అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. పలు విగ్రహాలను కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. – చిత్రమాలిక 8లో

అర్హులందరికీ 'జగనన్న చేదోడు'

- బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

ఒంగోలు: అర్హులందరికీ జగనన్న చేదోడు పథకం అందేలా చర్యలు చేపడుతున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. జగనన్న చేదోడు పథకం పెండింగ్ దరఖాస్తులపై గురువారం పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఒంగోలు ఇస్లాంపేట, శివప్రసాద్‌కాలనీ సచివాలయాల పరిధిలో అధిక సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించి స్వయంగా దరఖాస్తుదారులతో మాట్లాడి పరిశీలించారు. ఇస్లాంపేట సచివాలయం పరిధిలో పెండింగ్‌లో ఉన్న 97 మంది దరఖాస్తుదారుల్లో ఇంకా ముగ్గురి దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాల్సి ఉందని ఈడీ వెంకటేశ్వరరావు తెలిపారు. శివప్రసాద్‌కాలనీ సచివాలయం పరిధిలో 99 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, ముగ్గురివి మినహా మిగిలిన వారివి వెరిఫికేషన్ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇస్లాంపేట సచివాలయ పరిధిలో జగనన్న చేదోడు పథకం ద్వారా లబ్ధిపొందిన మస్తాన్‌రావుతో ఈడీ మాట్లాడారు. జగనన్న చేదోడు పథకం కింద ఇప్పటివరకు తనకు రెండు దఫాలుగా మొత్తం రూ.20 వేలు అందాయని, వాటితో ఇస్త్రీషాపు పెట్టుకుని రోజుకు రూ.600 సంపాదిస్తున్నానని మస్తాన్‌రావు తెలిపారు. గతంలో కుటుంబం గడవడం కూడా చాలా కష్టంగా ఉండేదని, ప్రస్తుతం స్థిరపడ్డానని చెప్పారు. శివప్రసాద్‌కాలనీకి చెందిన లబ్ధిదారు కడవకుదురు సురేష్ బాబు కూడా ఈ పథకం ద్వారా అందిన సొమ్ముతో సెలూన్‌షాపులో సామగ్రి ఏర్పాటు చేసుకున్నట్లు వెల్లడించారు. తద్వారా రోజుకు రూ.500 సంపాదిస్తున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. మరో లబ్ధిదారు కట కవిత మాట్లాడుతూ మూడేళ్లుగా మొత్తం రూ.30 వేలు ఈ పథకం ద్వారా తనకు అందాయని, వాటితో టైలరింగ్‌షాపు ఏర్పాటు చేసుకుని రోజుకు రూ.1000 ఆర్జిస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది అందే మొత్తంతో మరో కుట్టుమిషన్ కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. పాతకమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ సదానంద హెయిర్‌స్టైల్ షాపు పెట్టుకున్నానని, దీనవల్ల రోజుకు రూ.500 సంపాదిస్తూ ఆర్థిక బాధల నుంచి గట్టెక్కానని వివరించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ వెంట సంబంధిత ప్రాంతాల కార్పొరేటర్లు నూర్జహాన్, నియంతారెడ్డి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



కుట్టుమిషన్ పెట్టుకుని జీవిస్తున్న కోట కవిత షాపును పరిశీలిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

యూకేలో అమానిగుడిపాడు విద్యార్థి మృతి



జమ్మి సుబ్బారావు

యర్రగొండపాలెం: మండలంలోని అమానిగుడిపాడు గ్రామానికి చెందిన విద్యార్థి జమ్మి సుబ్బారావు (24) యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో గుండెపోటుతో మృతిచెందాడు. ఎమ్మెస్సీ పూర్తిచేసిన సుబ్బారావు యూకేలోని కార్డిఫ్‌లో ఎమ్మెస్ చేసేందుకు ఈ నెల 7వ తేదీ అమానిగుడిపాడు నుంచి బయలుదేరి చెన్నై వెళ్లాడు. 8వ తేదీ చెన్నైలో లండన్ ఫ్లైట్ ఎక్కి కార్డిఫ్ చేరుకున్నాడు. 16వ తేదీ కళాశాలలో చేరేందుకు అక్కడ పరిచయమైన స్నేహితులతో కలిసి మెట్రోపాలిటన్ యూనివర్శిటీకి బస్సులో బయలుదేరాడు. కార్డిఫ్ యూనివర్శిటీ చేరేందుకు రెండు బస్సులు మారాల్సి ఉండగా, సుబ్బారావు రెండో బస్సు ఎక్కడానికి సిద్ధమవుతున్న సమయంలో అస్వస్థతకు గురయ్యాడు. సమీపంలోని షాపులో షోడా తాగి అక్కడే కుప్పకూలిపోయాడు. అక్కడి పోలీసులు అమానిగుడిపాడులోని సుబ్బారావు ఇంటికి ఫోన్‌చేసి సమాచారం అందించేందుకు ప్రయత్నించారు. అయితే, వాళ్లు ఇంగ్లిష్‌లో మాట్లాడుతుండటంతో సుబ్బారావు తల్లిదండ్రులు జమ్మి లక్ష్మయ్య, కోటమ్మలు ఏవో కంపెనీ కాల్స్ అనుకుని పట్టించుకోలేదు. బుధవారం కన్సల్టెన్సీ నుంచి సమాచారం అందుకుని కుప్పకూలిపోయారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే ఆ కుటుంబం ఒక్కగానొక్క కుమారుడైన సుబ్బారావును ఉన్నత చదువులు చదివించేందుకు యూకే పంపారు. సుబ్బారావుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారు.. ఇక తమ కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లాడని తెలిసి గుండెలవిసేలా విలపిస్తున్నారు. సుబ్బారావు మృతి అమానిగుడిపాడు గ్రామంలో తీవ్రవిషాదాన్ని నింపింది. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

25న ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు: సాఫ్ట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక ఈనెల 25న సంతనూతలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ సుబ్బారావు, కె.వనజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, అండర్ 17 క్రీడాజట్ల ఎంపికలో పాల్గొనేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల పరిధిలోని విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులతో సంబంధిత పాఠశాలల పీఈటీ/పీడీలు ఆన్‌లైన్ ఎంట్రీచేసి, మాన్యువల్ ఎంట్రీఫారంతో వచ్చి ఎంపికకు హాజరు కావాలన్నారు. అండర్-17 కేటగిరీలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, జ్ఞాన భూమి చైల్డ్ ఐడీ నంబర్, సంబంధిత ప్రిన్సిపాల్ ధృవీకరణతో నిర్వాహకులకు సమర్పించి పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 9100761747 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గ్రోత్ మానిటరింగ్ నమోదు తప్పనిసరి

● ఐసీడీఎస్ పీడీ మాధురి



గ్రోత్ మానిటరింగ్ పరికరాలు అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ మాధురి

పొదిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల గ్రోత్ మానిటరింగ్ నమోదు తప్పనిసరి అని ఐసీడీఎస్ పీడీ జి.మాధురి పేర్కొన్నారు. గురువారం స్థానిక సీడీపీఓ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు గ్రోత్ మానిటరింగ్ పరికరాలు అందజేశారు. గ్రోత్ మానిటరింగ్ నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పోషకాహార మాసోత్సవాలను ప్రతి కేంద్రంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ సుధామారుతి, సూపర్‌వైజర్లు సుభాషిణి, సావిత్రి, సరిత, ప్రసన్న, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ, హెచ్‌ఎంలపై కేసులు నమోదు

పెద్దదోర్నాల: మండల విద్యాశాఖాధికారి, చిన్నదోర్నాలకు చెందిన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై అంకమరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రామచంద్రకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మస్తాన్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌లు పరస్పరం దాడులు చేసుకున్నారు. దీనికి సంబంధించి..ప్రధానోపాధ్యాయుడు తనను కులం పేరుతో దూషించి దాడి చేసినట్లు ఎంఈఓ ఫిర్యాదు చేయగా.. నాడు-నేడు పనులకు అడిగిన లంచాన్ని తాను ఇవ్వనందుకు ఎంఈఓ మస్తాన్‌నాయక్ తనపై దాడి చేశాడని ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఔషధాల దుష్ప్రభావాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రకళ

ఒంగోలు: ఔషధాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఫార్మకాలజీ విభాగం అధిపతి డాక్టర్ చంద్రకళ అన్నారు. స్థానిక క్విస్ ఫార్మసీ కాలేజీలో గురువారం జరిగిన 'ఔషధ భద్రత-ఔషధాల వల్ల కలిగే దుష్ప్రభావాలు నిర్ధారణ' అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. జాతీయ ఔషధ భద్రత వారోత్సవాలలో భాగంగా నాలుగు రోజులుగా అవగాహన ర్యాలీలు, రోగులకు కౌన్సెలింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించిన క్విస్ ఫార్మసీ కాలేజీ యాజమాన్యం, అధ్యాపక బృందాన్ని అభినందించారు. ప్రజల్లో ప్రాథమికంగా మందుల వినియోగం, తద్వారా వాటివల్ల జరిగే మేలు, దుష్ప్రభావాల పట్ల కూడా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టుల పాత్ర ముఖ్యమన్నారు. ముఖ్యంగా ఫార్మాకో విజిలెన్స్ విభాగాల్లో ఫార్మసీ విద్యార్థులకు అపార ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రీదేవిలు మాట్లాడుతూ ఐపీజీఏ భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు రూపొందించి ప్రజల్లో అవగాహన పెంచనున్నట్లు పేర్కొన్నారు. ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.దక్షిణామూర్తి మాట్లాడుతూ ఈనెల 23 వరకు జాతీయ ఫార్మకోవిజిలెన్స్ కార్యక్రమాలను తమ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం అంతర్జాతీయ అల్జీమర్స్‌పై అవగాహన సదస్సులో భాగంగా పోస్టర్ కాంపిటీషన్ నిర్వహించారు.



ఒంగోలు ద్వారకానగర్‌లో ప్రత్యేక ఆకర్షణగా దమరుక గణేశుడు



ఒంగోలు గాంధీరోడ్డులో పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు



ఒంగోలు భీమరాజువారివీధిలో భారీ వినాయకుడు

పార్వతి నందన.. పాప విమోచన

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. పార్వతీ నందనుడి శరణు కోరుతూ భక్తులు ఘనంగా పూజలు చేస్తున్నారు. నాలుగో రోజు గురువారం లంబోదరుడి ప్రతిమలను భక్తుల కోలాహలం నడుమ నిమజ్జనం చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



బేస్తవారిపేటలో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య



కనిగిరి కొత్తపేటలో కొలువైన గజాననుడు



సింగరాయకొండ : పాకల సముద్ర తీరంలో గంగ చెంతకు చేరుతున్న గణనాథుడు



మద్దిపూడిలో నిమజ్జన కోలాహలం



ఒంగోలు బండ్లమిట్టలో ఏకదంతుడికి పూజలు

బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

● మాజీ ఐఏఎస్ విజయకుమార్



విజయకుమార్‌తో పాదయాత్రలో పాల్గొన్న వరికూటి

కొండపి(సింగరాయకొండ): బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే లక్ష్యంగా తాను పాదయాత్ర చేపట్టానని మాజీ ఐఏఎస్ విజయకుమార్ పేర్కొన్నారు. ఆయన చేపట్టిన ఐక్యతా విజయపథం పాదయాత్ర గురువారం కొండపికి చేరుకుంది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు మండలంలోని పెద్ద కళ్లగుంట గ్రామ సమీపంలో విజయకుమార్‌కు సాదర స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం వరికూటి అయనతోపాటు మూడు కిలోమీటర్లు నడిచి పాదయాత్రకు సంఘీభావం ప్రకటించారు. సాయంత్రం విజయకుమార్ కొండపి మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీ, ఆదిఆంధ్ర కాలనీ, అంబేడ్కర్ నగర్, దాసిరెడ్డి పాలెం ఎస్సీ కాలనీ వాసులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. మాజీ ఐఏఎస్ విజయకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అనేక పథకాలు రూపొందిస్తోందని, కానీ ఆ పథకాలు సామాన్య ప్రజలకు మరింతగా చేరువకావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజానీకం ప్రభుత్వ పథకాలు పొందేలా జాగృతం చేసి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా పాదయాత్రలో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం కందుకూరు నియోజకవర్గానికి చేరుకుంటానని చెప్పారు. ఆదిఆంధ్ర కాలనీ వాసులు విజయకుమార్, ఆయన సతీమణి విజయశ్రీని ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆరికట్ల కోటిలింగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పోకూరి కోటయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, బచ్చల కోటు, ఎస్సై వైవీ రమణయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్-19 షెడ్యూల్ విడుదల



షెడ్యూల్ వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఐఓ సైమన్ విక్టర్, పీడీలు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 క్రీడల షెడ్యూల్‌ను ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ మండలి పర్యవేక్షణాధికారి ఎ.సైమన్ విక్టర్, జిల్లా ఇంటర్ విద్యాధికారి ఐ.శ్రీనివాసరావు గురువారం విడుదల చేశారు. ఆర్ఐఓ కార్యాలయంలో ఫిజికల్ డైరెక్టర్స్‌తో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.ఆదినారాయణ, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు టి.సుబ్బారావు, కె.డేవిడ్‌రాజ్, జి.పుష్పరాజ్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొడ్డు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ వివరాలివీ..

స్థానిక ఏబీయం జూనియర్ కాలేజీ ఆవరణలో చెస్, కరాటే, రోప్ స్కిప్పింగ్-సెప్టెంబర్ 25న, సైక్లింగ్, జూడో, ఫెన్సింగ్- 26న, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, యోగా-27న, సెపక్‌తక్రా, బాల్‌బ్యాడ్మింటన్, క్యారమ్స్-30న నిర్వహించనున్నారు. ఈనెల 29న కబడ్డీ పోటీలను చీరాల ఎస్‌ఎంఎల్ జూనియర్ కాలేజీలో, ఖోఖో పోటీలను జె.పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తారు. అక్టోబరు 3న బాక్సింగ్ పోటీలను ఒంగోలు మినీ స్టేడియంలో, అక్టోబరు 4న వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలను స్థానిక భారతీయ వ్యాయామ కళాశాలలో, అక్టోబరు 5న రెజ్లింగ్ పోటీలను దర్శిలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కాలేజీలో, అక్టోబరు 6న వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను సింగరాయకొండ జూనియర్ కాలేజీలో నిర్వహించనున్నారు. అక్టోబరు 4న హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, అక్టోబరు 5న క్రికెట్, అక్టోబరు 7న హాకీ, అక్టోబరు 27న అథ్లెటిక్స్ పోటీలను కందుకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించాలని నిర్ణయించారు.

జన గణ మన అధినాయక జయహే..



జాతీయ గీతం ఆలపిస్తున్న మార్కాపురం పట్టణవాసులు

● మార్కాపురంలో రోజూ జాతీయ గీతాలాపన
● ఉదయం 8 గంటలకు 2 నిమిషాలపాటు ఎక్కడివారు అక్కడే..

మార్కాపురం: మార్కాపురం పట్టణ ప్రజలు దేశభక్తిని చాటుతున్నారు. ఇక్కడి పాత బస్టాండులోని గాంధీ పార్కులో గతేడాది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ మైక్ ఏర్పాటు చేసి రోజూ ఉదయం 8 గంటలకు జాతీయ గీతం ప్రసారమయ్యేలా ఏర్పాటు చేశారు. అయితే కొద్దిరోజులపాటే పుర ప్రజలు జాతీయ గీతాలాపనలో పాల్గొన్నారు. తాజాగా వినాయక చవితి పర్వదినం నుంచి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపన ప్రారంభమైంది. రోజూ సుమారు 20 మంది సరిగ్గా 8 గంటలకు పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ వద్దకు చేరుకుని మైకులో వినిపించే జాతీయ గీతంతో శృతికలుపుతూ రెండు నిమిషాలపాటు ట్రాఫిక్‌ను నిలిపివేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు తమవంతు కృషిచేస్తామని స్థానికులు పీవీ కృష్ణారావు, ఎల్ఐసీ శేషగిరిరావు, జె.శ్రీనివాసులు, బలరామ్, చెంచిరెడ్డి తదితరులు పేర్కొన్నారు.

ఏరియా వైద్యశాలలో శిశువు మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆస్పత్రి ముందు బంధువుల ఆందోళన



మృతి చెందిన శిశువు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో గురువారం మగ శిశువు మృతి చెందాడు. అయితే వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పుట్టిన బిడ్డ మృతి చెందాడని బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అంబవరం గ్రామానికి చెందిన హసీనా అనే మహిళకు గురువారం ఉదయం వైద్యులు ఆపరేషన్ చేసి మగశిశువును బయటకు తీశారు. అయితే బయటకు తీసిన వెంటనే ఆ మగ శిశువు మృతి చెందింది. అయితే వైద్యుల నిర్లక్ష్యంతోనే మగ శిశువు మృతి చెందాడని బంధువుల వైద్యశాల ముందు బైఠాయించి నిరసనకు దిగారు. మూడు రోజుల నుంచి ఆస్పత్రిలోనే ఉన్నామని, వైద్యులు సరిగ్గా పట్టించుకోలేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడి సర్దిచెప్పారు. దీనిపై వైద్యశాల సూపరింటెండెంట్ సూరిబాబును వివరణ కోరగా..బిడ్డ ఉమ్మనీరు తాగడం వల్లే మృతి చెందాడని చెప్పారు. వైద్య సేవల్లో ఎటువంటి నిర్లక్ష్యం లేదన్నారు. శిశువు తల్లిదండ్రులకు, బంధువులకు అవగాహన లేక ఆందోళన చేపట్టారని తెలిపారు.

విద్యుదాఘాతానికి మహిళ మృతి



మృతురాలు నాగలక్ష్మి(ఫైల్)

కొత్తపట్నం: విద్యుదాఘాతానికి మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని రంగాయపాలెంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..అల్లూరుకు చెందిన సామంతుల నాగలక్ష్మి(35) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో గురువారం రంగాయపాలెంలో వేరుశనగ మండీలు పీకేందుకు గ్రామానికి చెందిన కొంత మంది కూలీలతో కలిసి ఆటోలో వెళ్లారు. పొలంలో ఉన్న 20 అడుగుల అల్యూమినియం స్ప్రింక్లర్ పైప్‌ను తీసుకొని కొలతలు వేస్తున్నారు. ఆ పైప్ 11 కేవీ లైన్‌కు తగలడంతో నాగలక్ష్మి విద్యుత్ షాక్‌కు గురై పడిపోయింది. వెంటనే తోటి కూలీలు ఆటోలో కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అక్కడ డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. తల్లి చనిపోయిన విషయాన్ని తెలుసుకున్న పిల్లలు విలపించిన తీరు స్థానికులను కన్నీరు పెట్టించింది.

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి

● వాడరేవు తీరంలో నలుగురు మహిళలు గల్లంతు
● వేగంగా స్పందించి రక్షించిన మెరైన్ పోలీసులు



ఒడ్డుకు చేరిన మహిళలతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్సై సుబ్బారావు, పోలీసులు

చీరాల టౌన్: వాడరేవు సముద్ర తీరంలో గురువారం సాయంత్రం గణేశ్ నిమజ్జన సమయంలో అపశ్రుతి చోటుచేసుకుంది. మెరైన్ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో నలుగురు మహిళలు ప్రాణాలతో ఒడ్డుకు చేరారు. మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు కథనం మేరకు.. చిలకలూరిపేటకు చెందిన 50 మంది భక్త బృందం గణేశుడి నిమజ్జనం కోసం వాడరేవు తీరానికి వచ్చారు. విగ్రహ నిమజ్జన అనంతరం సముద్ర స్నానం చేస్తుండగా బృందంలోని నలుగురు మహిళలు అలల తాకిడికి కొట్టుకుపోయారు. సమీపంలోనే ఉన్న మెరైన్ పోలీసులు సైకం ప్రసాద్, ఎస్.చిరంజీవి, ఎ.నరేష్, హోంగార్డు పోతురాజు వేగంగా స్పందించి తమ ప్రాణాలను పణంగా పెట్టి గల్లంతవుతున్న నలుగురు మహిళలను రక్షించారు. సముద్రం నీరు తాగిన మహిళలకు ప్రథమ చికిత్స చేసి బంధువులకు అప్పగించారు. మెరుపు వేగంతో స్పందించి మహిళలను కాపాడిన పోలీసులను బంధువులతో పాటుగా ఎస్పీ వకుల్ జిందాల్, మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.